దళారుల దందా



అల్లం తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్న దళారులు



సంతలో మామిడి పండ్ల కొనుగోలుదారుల కోసం ఎదురు చూస్తున్న గిరిజన మహిళలు

- అరకు వారపు సంతలో అడ్డగోలుగా వ్యాపారం
- నష్టాల్లో గిరిజన రైతులు
- కానరాని గిట్టుబాటు ధరలు పట్టించుకోని అధికారులు

డుంబ్రిగుడ: ఒకరి కష్టం మరోకరికి భోజ్యంలా ఉంది..ఇక్కడ వారపు సంతలో దళారీల వ్యవస్థను అడిగేవాడు లేకపోవడంతో ఇష్టనుసారంగా కొనుగోలుదారులు, దళారులు వ్యాపారాలు సాగిస్తున్నారు. మండలంలోని అరకు వారపు సంత అంటే ఎంతో ప్రాచుర్యం పొందింది. ఒడిశా, చత్తీస్‌గఢ్, బెంగాళ్ నుంచి ఇక్కడ వ్యాపారులు వచ్చి అనేక రకాల అటవీ ఉత్పతులతో పాటు, కూరగాయలు, కొనుగోలు చేస్తుంటారు. అలాంటిది ఇక్కడ గిరిజనులు పండించి సేకరించి తీసుకువస్తున్న వస్తువులకు సరైన గిట్టుబాటు ధరలు లేక రైతులు మోసపోతున్నారు. ప్రస్తుతం కేజీ అల్లం రూ.20 నుంచి రూ.25లకు కొనుగోలు చేస్తున్నారు. పెద్దసైజు పనసపండు ఒక్కటి కేవలం రూ.100 నుంచి రూ.150, జత రూ.200, పైనాపిల్ ఒక్కటి రూ.10లు అమ్మకాలు జరుగుతున్నాయి. కొండచీపుళ్లు కేవలం రూ.50 కొనుగోలు చేస్తున్నారు. అరకు వారపు సంతలో ఇంత పెద్దఎత్తున దళారుల మోసం జరుగుతున్న అధికారులు పట్టించుకోవడం లేదంటున్నారు. జీసీసీ కోనుగోలు చేస్తే కనీసం రైతులకు మద్దతు ధరలైన వస్తుందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటవీ సంపద జీసీసీ ఎందుకు కొనుగోలు చేయడం లేదని పలువురు ప్రశ్నస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో మార్కెట్ యార్డ్ చైర్మన్, సభ్యులున్నప్పుడు జీసీసీ గొడౌన్‌లో అటవీ ఉత్పతులు, వివిధ రకాల ధినుసులు కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం సంవత్సరం కావస్తున్న ఆ గొడౌన్‌ల మూతతో దర్శనం ఇస్తున్నాయి. గిరిజనులకు జీసీసీ అండగా ఉండి సరకులు కొనుగోలు చేసే ప్రయత్నాన్ని ప్రారంభించాలని అనేకమంది గిరిజనులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి దళారీల వ్యవస్థ నుంచి కాపాడాలని, జీసీసీ ద్వారా అన్ని రకాల వస్తువులను కొనుగోలు చేస్తే రైతుల కష్టానికి తగిన ప్రతిఫలం దక్కుతుందని పలువురు కోరుతున్నారు.



వారపుసంతతో విక్రయానికి తీసుకొచ్చిన పనస



సంతలో అమ్మకానికి తీసుకు వచ్చిన పైనాపిల్

జీసీసీ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయాలి



ప్రస్తుతం అల్లం డిమాండ్ ఉన్నా వారపు సంతలో ధర లేకపోవడంతో నష్టం వాటిల్లుతుందని భయంతో తక్కువ ధరకు విక్రయించాల్సి వస్తోంది. దళారులదే రాజ్యామేలుతుంది. జీసీసీ కొనుగోలు చేయకపోవడంతో దళారులను నమ్మి మోసపోతున్నాం. ఈ విషయం అధికారులు పట్టించుకొని జీసీసీలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి. **– గొల్లోరి రామకృష్ణ, తొటవలస గ్రామం, డుంబ్రిగుడ**

అధికారులు స్పందించాలి



పనస పండుకు తక్కు ధరలు అడుగుతున్నారు. గిరిజన ప్రాంతంలోని పనసకు మైదాన ప్రాంతంలో ఎంతో గిరాకీ ఉన్నప్పటికి దళారులు వారు లబ్ధిపొందేందుకు మావద్ద తక్కు ధరకు కొనుగోలు చేసి తరలిస్తున్నారు. ఈ విషయమై అధికారులు పట్లించుకుంటే కనీసం మద్దతు ధరలు లభిస్థాయి. **– గోవర్ధన్, పోతంగి గ్రామం, డుంబ్రిగుడ**

క్లుప్తంగా

ప్రకృతి సాగుతో పంటలకు మేలు



కొమరాపురంలో రైతులకు కషాయం తయారీని వివరిస్తున్న అప్పలరాజు

రాజవొమ్మంగి: ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో భాగంగా సొంతంగా తయారు చేసుకొనే కషాయం ద్వారా వివిధ పంటలపై అధిక దిగుబడులు సాధించవచ్చని, చీడపీడలను నివారించుకోవచ్చని ఎంసీఆర్పీ అప్పలరాజు వివరించారు. మండలంలోని కొమరాపురంలో రైతులకు పది రకాల ఆకులు, మిరపకాయలు, మిరియాలు, పొగాకు, వెల్లుల్లి, లవంగాలు, దేశీయ ఆవుపేడ, ఆవు మూత్రం తదితర వస్తువులతో కషాయం తయారీ చేసే విధానం చేసి చూపించారు. వివిధ ముడి సరకులతో తయారుచేసే ఈ కషాయాన్ని 45 రోజుల పాటు ఊరబెట్టి, తరువాత పంటలపై పిచికారీ చేసుకోవచ్చన్నారు. మూడు లీటర్ల కషాయాన్ని వంద లీటర్ల నీటితో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. అయితే ఈ కషాయాన్ని పూత పిందె దశలో ఉపయోగించొద్దని సూచించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న ఫాదర్ స్టీపెన్

జి.మాడుగుల: మండలంలో గాంధీనగరం గ్రామంలో ఆదివారం మలయంగర్ క్యాథలిక్ చర్చ్, సెయింట్ ఆన్స్ పాఠశాల ఆధ్వర్యంలో ఫాదర్ స్టీఫెన్ మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మేరీ ఇవానిస్ జ్ఞాపకార్థం ఈ మెగా వైద్య శిబిరం నిర్వహించినట్టు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో జి.మాడుగుల, గాంధీనగరం, మధురమామిడి, ఉరుము, రచ్చపల్లి పరసర ప్రాంతాల నుంచి 120 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్టు ఆమె తెలిపారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనారోగ్యమైతే తక్షణమే వైద్య సేవలు పొందాలని చెప్పారు. కార్యక్రమంలో ఫాదర్ మోబిన్, సిస్టర్ జూడిట్, సిస్టర్ జూలియన్ తదితరులు పాల్గొన్నారు.

పిచ్చికుక్క దాడిలో నలుగురికి గాయాలు



చికిత్స పొందుతున్న గిరిజన యువకుడు

డుంబ్రిగుడ: పిచ్చికుక్క దాడిలో నలుగురు గాయపడ్డారు. మండల కేంద్రంలో ఆదివారం ఉదయం జరిగింది. స్థానికంగా ఉంటున్న గిరిజనులపై ఓ పిచ్చికుక్క దాడి చేసింది. ఈ ఘటనలో నలుగురుకి గాయాలయ్యాయి. వీరు స్థానిక పీహెచ్‌సీలో చికిత్స చేయించుకున్నారు. ఇకపై ఇలాంటి సంఘటనలు జరగకుండా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులతో పాటు గాయపడిన వారు కోరారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు

నర్పువరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకేషనల్ ఫిజియోథెరపీలో అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పెనుమత్స శిరీషరాణి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. బీపీటీలో 55 శాతం మార్కులు, అనుభవం కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 15 మధ్యాహ్నం 3 గంటల్లోపు కళాశాలలో సంప్రదించాల్సిందిగా కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న మంత్రి శ్రీనివాసు, ఎమ్మెల్యే శిరీషా

గంగవరం: సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర సెర్ప్ మంత్రి కొండపల్లి శ్రీనివాసు మండలం నెల్లిపూడిలో జరిగిన కార్యక్రమంలో ఆదివారం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి, మాజీ ఎమ్మెల్యేలు వెంకటేశ్వరరావు, బాబురమేష్, రాజేశ్వరిలు పాల్గొన్నారు. నెల్లిపూడిలో ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు మంత్రి సూచనలు చేశారు. నాయకులు శ్రీనివాస్ యాదవ్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త భవనం మంజూరు చేయాలని నిరసన



శిథిలావస్థలో ఉన్న పాఠశాల ఎదుట నిరసన చేస్తున్న తాల్లబుతోట గ్రామస్తులు

ముంచంగిపుట్టు: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పూర్తిగా శిథిలావస్థకు చేరుకొని కూలిపోయే పరిస్థితిలో ఉందని పాఠశాలకు నూతన భవనం మంజూరు చేయాలని మండలంలో గల సుజనకోట పంచాయతీ తాల్లబుతోట గ్రామ గిరిజనులు డిమాండ్ చేశారు. పాఠశాల ఆవరణంలో తాల్లబుతోట గ్రామస్తులంతా ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. పలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు చిట్టిబాబు, గురుమూర్తి, బలరాం, సిద్దేష్‌లు మాట్లాడుతూ పాఠశాల భవనం పూర్తిగా పాడై ఉందని, చేర్పించాలన్నారు. ఎప్పుడు కూలి పోతుందో తెలియని పరిస్థితి నెలకొందని దీంతో పిల్లలను పాఠశాలకు పంపించేందుకు భయమేస్తుందని, నూతన భవనం మంజూరు చేసి తమ పిల్లలకు మేలు చేయాలని వారు కోరారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తులు

పాయకరావుపేట: పట్టణంలో ప్రభుత్వ ఐటీఐలో 2025–26 విద్యా సంవత్సరంలో రెండో విడత ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ తెలిపారు. ఈ నెల 20వ తేదీలోగా విద్యార్థులు ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ నెల 21వ తేదీలోగా సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసుకోవాలని తెలిపారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయించుకోకుంటే వారి పేర్లు మెరిట్ లిస్టులో ఉండవన్నారు. ఎస్సెస్సీ, క్యాస్ట్, పాస్ ఫొటో, ఈమెయిల్ ఐడీ, ఆధార్ లింక్ ఫోన్ నంబర్, ఆధార్ కార్డుతో ప్రభుత్వ ఐటీఐలో సంప్రదించాలన్నారు. కౌన్సెలింగ్ కోసం 7013737243, 9989478278 నంబర్లను సంప్రదించాలన్నారు.

కష్టపడి చదివితే ఉన్నత ఫలితాలు



విద్యార్థులకు స్పోర్ట్స్ సామగ్రి పంపిణీ చేస్తున్న దాత

రంపచోడవరం: విద్యార్థులు కష్టపడి చదవడం ద్వారా మంచి ఉన్నత ఫలితాలు పొందవచ్చని ఆర్ట్స్ కళాశాల రిటైర్డ్ అధ్యాపకుడు వెంకటేశ్వరరావు అన్నారు. దేవీపట్నం మండల కచ్చులూరులో ప్రకృతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆట వస్తువులు, పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకుడు పిల్లంగోరు పాపారావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన విద్యార్థులకు అనేక అవకాశాలు ఉన్నాయని బాగా చదువుకోవడం ద్వారా వాటిని అందిపుచ్చుకోవాలన్నారు. ప్రకృతి సంస్థ డైరెక్టర్ జి.సుబ్బారాజు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల కాలనీల్లో పాఠశాలల్లో చదువుతున్న చిన్నారులకు వివిధ రకాల క్రీడా సామగ్రి, నోట్ పుస్తకాలను కెనాడాకు చెందిన ఒంటారియో టీచర్స్ ఫెడరేషన్ సహకరంతో అందించినట్టు తెలిపారు. అలాగే తమ సంస్థ ద్వారా విద్యార్థులకు సాయంత్రం సమయంలో ట్యూషన్ క్లాసులు చెబుతున్నట్టు పేర్కొన్నారు. కో–ఆర్డినేటర్ రమేష్, రాము సునీత, సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

400 మందికి వైద్యపరీక్షలు

రంపచోడవరం: మండల కేంద్రంలో రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు టి.వి.సుబ్బారావు, రాయుడు, శ్రీనివాస్, దాసరి ఉమా మహేష్ సంపత్‌కుమార్‌లు పాల్గొని సుమారు 400 మంది ఉచితంగా వైద్య సేవలు పొందారు. పరమహంస యోగానంద నేత్రాలయం(వేమగిరి) ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 72 మందికి కంటి పరీక్షలు చేశారు. 18 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. పదిమందిని కంటి ఆపరేషన్‌ల నిమిత్తం యోగానంద నేత్రాలయానికి తరలించారు. జీబీఆర్ ఫౌండేషన్ ద్వారా ఫిట్స్ క్యాంప్ నిర్వహించారు. డాక్టర్ గోపాలం శివన్నారాయణ మూర్చ వ్యాధిపై అవగాహన కల్పించారు. రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్, క్యాంప్ కో–ఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలింపు

మునగపాక: ఎటువంటి అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. కృష్ణంరాజు కాలువపై నూతనంగా బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా తవ్వేసిన మట్టిని ఆదివారం కొంతమంది అక్రమార్కులు ఎటువంటి అనుమతులు లేకుండా తరలించుకుపోవడం విమర్శలకు తావిస్తోంది. పట్టపగలే యథేచ్ఛగా మట్టి తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఉన్నతాధికారులు స్పందించి మట్టి అక్రమ తరలింపు జరగకుండా చూడాలని కోరుతున్నారు.

బలవంతపు భూసేకరణ నిలిపివేయాలి

కె.కోటపాడు : మండలంలో ఆర్లి, చింతపాలెం, గరుగుబిల్లి ప్రాంతాల్లో వ్యవసాయ భూములను ఎస్ఈజెడ్‌ల కోసం రైతుల నుంచి బలవంతంగా తీసుకోవడం తగదని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.వెంకన్న అన్నారు. ఎస్ఈజెడ్‌లకు భూకేటాయింపుల కోసం రైతుల నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా రహస్య సర్వేలను రెవెన్యూ అధికారులు చేస్తూ వారిని ఇబ్బందులు పెట్టే చర్యలు ఎంత మాత్రం సమంజసం కాదని ఆయన అన్నారు. బలవంతపు భూ సేకరణ నిలుపుదల చేయాలని కోరుతూ కె.కోటపాడు మండల తహసీల్దార్‌కు ఈ నెల 16న చెప్పుకుందాం.. కదిలిరండి కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని, ఈ మూడు గ్రామాల్లో రైతులను ఆదివారం కలిసి కరపత్రాలను అందించి ప్రచారం చేశారు. ఉదయం 10 గంటలకు మూడు గ్రామాల్లోని రైతులు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న ధర్నాకు హాజరుకావాలని ఆయన కోరారు. అచ్యుతాపురం ప్రాంతాల్లో ఉన్న కంపెనీల వ్యర్థాలు సముద్రంలో కలుస్తున్నాయని, మరి ఈ ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న కంపెనీల వ్యర్థాలు ఎక్కడకు విడిచిపెడతారని అధికారులను వెంకన్న ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు యర్రా దేముడు, ఈర్లె నాయుడుబాబు, రొంగలి ముత్యాలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.



ఆర్లిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకన్న

అ'పూర్వ' సమ్మేళనం



నర్సీపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాల గురువులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

నర్సీపట్నం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1978–80 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియెట్ చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. 44 ఏళ్ల తరువాత ఒక్క చోట చేరడంతో వారిలో నవ్వులు వెల్లువిరిశాయి. ఒకరిని ఒకరు ఆప్యాయతగా పలకరించుకుని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థి దశలో జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. అప్పటి గురువులు ఇంగ్లిష్ అధ్యాపకుడు శాస్త్రి, తెలుగు అధ్యాపకుడు నర్సింహమూర్తి, హైస్కూల్ ఇంగ్లిష్ టీచర్ రమణరావులను శాలువా కప్పి జ్ఞాపికను అందజేసి ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థి, కూచిపూడి నృత్య అకాడమీ నిర్వాహకుడు ధనం మాస్టార్ శిష్యులతో ఆంధ్రా నాట్యం కార్యక్రమాన్ని ప్రదర్శించారు. పూర్వ విద్యార్థులు కుటుంబ సభ్యులతో పాల్గొని ఆనందంగా గడిపారు.



వడ్డాది కేఏడీ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో కలిసిన పూర్వ విద్యార్థులు

వడ్డాది హైస్కూల్‌లో..

బుచ్చెయ్యపేట: వడ్డాది కోవెల అప్పన్నదొర జిల్లా పరిషత్ హైస్కూలులో 1997–98 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. ఈ బ్యాచ్‌కు చెందిన 100 మంది విద్యార్థులకు 79 మంది హాజరై సందడి చేశారు. అప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. పూర్వ విద్యార్థులు మంచాల నానాజీ, ఆడారి సూర్యప్రకాశ్, సాయం సురేంద్ర, సింగారపు సూరిబాబు, లత, మజ్జి ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థిని ఎంపిక

కశింకోట: తాళ్లపాలెంలో గాయత్రి హైస్కూలుకు చెందిన విద్యార్థిని కోన బేబీ భవిష్య శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. ఈ ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 582 మార్కులు సాధించిన మేరకు రెండో విడత జాబితాలో ఎంపికై నట్లు పాఠశాల కమిటీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది.


ఆదివాసీల అభ్యున్నతికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న రామ్మూర్తి గౌడు

గంగవరం: ఆదివాసీ గౌడు సంక్షేమ సంఘం ప్రత్యేక సమావేశం ఆదివారం గంగవరంలో జరిగింది. సంఘం అధ్యక్షుడు మట్టా రామ్మూర్తి, పశ్చిమ గోదావరి జిల్లా జీలుగుమిల్లి ఏజెన్సీ గౌడు సంఘం అధ్యక్షుడు పంబి అప్పలస్వామి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో జీవో నెంబరు–3 పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించినట్టు చెప్పారు. కులధ్రువీకరణ పత్రాల జారీ విషయంలో జరుగుతున్న జాప్యాన్ని నివారించేందుకు అవసరమైన చర్యలపై మాట్లాడారు. అనంతరం సంఘం నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. సంఘం అధ్యక్షుడిగా రామ్మూర్తి గౌడును, ఉపాధ్యక్షుడిగా కిల్లో త్రినాథ్‌గౌడు, కార్యదర్శిగా సూర్యభాస్కరరావు గౌడు, ట్రెజరర్‌గా రామకృష్ణ, సెక్రటరీగా శ్రీను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సంఘం అధ్యక్షుడు రామ్మూర్తి గౌడు మాట్లాడుతూ నూతన కమిటీ ఆదివాసీ గౌడులను ఏకం చేసి ప్రత్యేక కార్యచరణ నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆదివాసీల అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు. ఉద్దారావు, రామ్మూర్తి గౌడు, రాజు తదితరులు పాల్గొన్నారు.

మోదమాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు



మోదమాంబ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మాడుగుల రూరల్: ఎం.కోడూరు మోదమాంబ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారి ఆలయానికి వచ్చిన భక్తులకు గ్రామానికి చెందిన పడాల కొండలరావు, లక్ష్మీకుమారి దంపతుల ఆర్థిక సహకారంతో ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు, సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పడాల కొండలరావు పాల్గొన్నారు.

వైభవంగా బోనాల సమర్పణ



అమ్మవారికి బోనాలను సమర్పిస్తున్న భక్తులు

కోటవురట్ల: తలుపులమ్మతల్లికి పెద్ద సంఖ్యలో భక్తులు బోనాలను సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామం నుంచి తంగేడు కాటా వద్ద ఆలయం వరకు గ్రామస్తులు బోనాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. కోలాటం, డప్పు వాయిద్యాలతో బోనాలను వైభవంగా ఊరేగించి అమ్మవారికి సమర్పించారు. పాడి పంటలతో అంతా సుభిక్షంగా ఉండేలా దీవించాలని అమ్మవారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద కోలాహలం నెలకొంది. అనంతరం మధ్యాహ్నం అన్నసమారాధన చేశారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు, యువకులు పర్యవేక్షణ చేశారు.

కొమరం భీమ్ విగ్రహం ధ్వంసం చేయడం సరికాదు



మాట్లాడుతున్న సర్పంచ్ రామారావు, పిసా కమిటీ సభ్యుడు జయరాజు

వి.ఆర్.పురం: గిరిజనులకు ఆరాధ్య దైవం అయిన కొమరం భీమ్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం సరికాదని చిన్నమట్టపల్లి సర్పంచ్ పిట్టా రామారావు, పీసా కమిటీ సభ్యుడు కోటం జయరాజు అన్నా రు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నమట్టపల్లి, గుండుగూడెం, చింతరేగిపల్లి గ్రామా ల ప్రజలతో సమావేశం నిర్వహించారు. కోతులగుట్టలో కొమరం భీమ్ విగ్రహం ధ్వంసం చేసిన దుండగులను అతినంగా శిక్షించాలన్నారు. గిరిజనుల కోసం అనేక ఉద్యమాలు పోరాటలు నిర్వహించారన్నారు. ఆదివాసి జాతీ మొత్తం తీవ్రంగా ఖండిస్తున్నమన్నారు. రామారావు , కరుణకర్, శంఖర్, రాముడు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



గుమ్మసిరగంపుట్టు వద్ద కోతకు గురైన ఆర్ అండ్ బీ రోడ్డు

ముంచంగిపుట్టు: మండల కేంద్రం నుంచి జోలాపుట్టు వెళ్లే ఆర్అండ్‌బీ ప్రధాన రహదారిలో గుమ్మసిరగంపుట్టు సమీపంలో రహదారి మళ్లీ కోతకు గురైంది. ఇటీవల ఆర్అండ్‌బీ అధికారులు మరమ్మతులు చేసి కోతకు గురైన రహదారిని బాగు చేశారు. ఇటీవల కురుసిన భారీ వర్షాలకు ఇదే ప్రాంతంలో మళ్లీ ఆర్అండ్‌బీ రహదారి కోతకు గురైంది. నిత్యం వందాల సంఖ్యలో వాహనాలు ఈ మార్గంలో తిరుగుతూ ఉంటాయి. కోతకు గురైన రహదారి వద్ద ఎప్పుడూ ఏ ప్రమాదం జరుగుతుందో అని వాహనదారులు భయం భయంగా ప్రయాణాలు చేస్తున్నారు. కోతకు గురైన రహదారిని వెంటనే బాగుచేయాలని ఆర్అండ్‌బీ అధికారులకు కించాయిపుట్టు సర్పంచ్ సుభాష్ చంద్ర, ఎంపీటీసీ సత్యనారాయణ మాట్లాడుతూ రహదారి రోజురోజుకు కోతకు గురవుతూ వస్తుంది. పూర్తిగా కోతకు గురై రాకపోకలకు విఘాతం కలగక ముందే, ఈ ప్రదేశంలో కల్వర్టు నిర్మిస్తే వరదనీరు రోడ్డుపై రాకుండా ఉంటుందన్నారు. ఇప్పటికై నా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

చల్లగా చూడు తల్లీ..

వైభవంగా యానాద్రి అమ్మవారి జాతర



యానాద్రి అమ్మవారు



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

యలమంచిలి రూరల్: అమ్మా..యానాద్రమ్మా.. మాకే కష్టం రాకుండా చల్లగా చూడు తల్లీ.. అంటూ భక్తులు తమ మొక్కులు తీర్చుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆషాఢ మాసం చివరి ఆదివారం ఏటా యానాద్రి అమ్మవారి జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. పట్టణంలోని అల్లూరి సీతారామరాజు కాలనీలో అమ్మవారి జాతర వైభవంగా నిర్వహించారు. వేకువజాము నుంచే అమ్మవారికి పూజలు చేసేందుకు భక్తులు బారులు తీరారు. మహిళలు అమ్మవారికి చీర, రవికెలు, నల్లపూసలు, గాజులు సమర్పించి పసుపుకుంకుమలతో పూజలు చేశారు. స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ సహా పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ భక్తులకు ఉచిత ప్రసాద వితరణ చేసింది. సాయంత్రం నేలవేషాలు, కోలాట ప్రదర్శనలు, రాత్రి వరకూ ఉర్రూతలూగించే సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. బంధుమిత్రుల రాకతో అల్లూరి సీతారామరాజు కాలనీలో సందడి నెలకొంది. పట్టణ పోలీసులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఘనంగా అమ్మవారి పండగ

అచ్యుతాపురం: నునపర్తి గ్రామంలో పసల మారమ్మ పండగ ఆదివారం ఘనంగా జరిగింది. పెద్ద ఎత్తున భక్తులు తరలి రావడంతో ఆలయం వద్ద సందడి వాతావరణం ఏర్పడింది. అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. పండగ సందర్భంగా ఆలయం వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లు సందర్శకులతో కిటకిటలాడాయి.